# మహిళలపై హింసను నిరశించండి!
# సమానత్వం, సాధికారితకై ఉద్యమించండి!!

**- సిపియం**

**సోదరీ సోదరులారా !**

**అసమానతలకు మారుపేరు మహిళ:** దేశంలో అక్షరాస్యత పురుషుల్లో 74శాతం అయితే స్త్రీలో 59శాతమే. దళిత, మైనారిటీ, గిరిజన మహిళల్లో 40శాతం కన్నా తక్కువే. మహిళలు 79శాతం మంది పోషకాహారం లేక రక్తహీనతకు గురౌతున్నారు. 18-38 సంవత్సరాలలో మరణాల శాతం వీరిలోనే ఎక్కువ. ధరలభారం, హీనమైన వేతనాలతో దారిద్ర్యాన్ని అనుభవిస్తూ కుటుంబ భారాన్ని మోస్తున్నారు. వీరిపై హింస, అత్యాచారాలు, హత్యలు నిత్యకృత్యంగా సాగుతున్నాయి. పురుషులతో సమానస్థాయి కుటుంబంలోనూ, పనిలోనూ లేదు. స్వాతంత్ర్యానంతరం కాంగ్రెస్, బిజెపి, టిడిపిలాంటి పార్టీల పాలనలో దేశంలో మహిళల స్థితి కిది నిదర్శనం.

మహిళలు స్వేచ్ఛా, సమానత్వం పొందితేనే సమాజ అభివృద్ధి సాధ్యమని సిపియం విశ్వసిస్తోంది. మహిళల హక్కులు, రక్షణ, రిజర్వేషన్ల అమలు, అత్యాచారాలకు వ్యతిరేకంగానూ సిపియం పోరాటం సాగిస్తోంది. గతంలో సిపియం నాయకత్వాన కేరళలో వున్న వామపక్ష ప్రజాతంత్ర ప్రభుత్వం, ప్రస్తుతం అధికారంలో వున్న త్రిపుర అక్షరాస్యతలో దేశంలోనే మొదటి, రెండవ స్థానాల్లో వున్నాయి. శిశు మరణాలు 1000కి మనరాష్ట్రంలో 42 అయితే కేరళలో 6 మాత్రమే. మహిళలవిద్య, ఆరోగ్యం, ఉపాధి, కనీస వసతుల కల్పనలో ఇతర రాష్ట్రాలకంటే వామపక్ష పాలిత రాష్ట్రాలే ముందుపీఠిన వుండడం సిపియం ప్రత్యేక విధానాలకు నిదర్శనం.

**మద్యం మహమ్మారి:** అధికారంలోకి వస్తే బెల్టుషాపులు రద్దు, మద్యం నియంత్రణ చేస్తామన్న టిడిపి అందుకు భిన్నంగా నేడు ప్రభుత్వ ఆదాయాన్ని రూ. 11,400కోట్లనుండి రూ. 15వేల కోట్లకు పెంచుకోవడానికి మద్యం షాపులు పెంచింది. టెట్రా ప్యాకుల్లో దుకాణాలలో మద్యం అమ్మకానికి ప్రభుత్వం తెరలేపింది. మద్యం మత్తుల్లో మహిళలపై ఇంటా, బయటా అత్యాచారాలకు, నేరాలకు పాల్పడడం మనం చూస్తున్నాం. ఇదేనా టిడిపి మహిళలకిచ్చే కానుక?

**ఘరానా మోసం:** అధికారంలోకి వస్తే డ్వాక్రా రుణమాఫి చేస్తామని టిడిపి వాగ్దానం చేసింది. ఆచరణలో మహిళలను మోసగించింది. డ్వాక్రా మహిళలకు ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలు రూ. 14,699కోట్లు. అయితే లక్షచొప్పున మాఫీ చేస్తానని ప్రకటించి, రూ. 7,644కోట్లు విడుదల చేస్తామని చెప్పింది. మాఫి చేస్తామన్నది రూ. 2,666కోట్లు. రుణాలపై అయిన వడ్డీ రూ. 1,310కోట్లు. కానీ ఇప్పటికీ ఏవీ విడుదల చేయలేదు. ఇది బాబుగారి నిర్వాకం.

**మహిళలపై దాడులు :** విమానాలు, మెట్రో రైళ్లు నడపడంతో సహా అన్ని రంగాలలో మహిళలు తమ అద్భుత శక్తి సామర్థ్యాలు రుజువు చేసుకున్నారు. అయినా పని ప్రదేశాలలోనూ, నివాస ప్రాంతాలలోనూ మహిళలపై దాడులు రోజు రోజుకు పెరుగుతున్నాయి. భద్రత కొరవడింది. నేరస్తులకు ప్రముఖులే అండదండలుగా వుంటున్న ఘటనలు వెలుగు చూస్తున్నాయి. ఫలితంగా నేరస్తులు యధేచ్ఛగా దాడులు కొనసాగిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ 36,622 (12.6%) నేరాలతో దేశంలో రెండవ స్థానంలో వుంది. 43.6%కేసులు వీరిపై హింసకు సంబంధించినవే. బాలికలపై లైంగిక దాడులు 336% పెరిగాయి. చట్టాలున్నా వీరికి రక్షణలేదు.

**మహిళా వ్యతిరేక నేతలు :** "నస్త్రీ స్వాతంత్ర్యమర్హతి" అంటూ బాల్యంలో తండ్రి, యవ్వనంలో భర్త, వార్ధక్యంలో కొడుకు రక్షణలో స్త్రీ వుండాలని హిందూ ఉన్మాద మనుధర్మ వాదులు పురుషాధిపత్యాన్ని బాహాటంగా ప్రచారం చేస్తున్నారు. మహిళలంటే పిల్లల్ని కని, పెంచే యంత్రాలని వీరి భావన. బిజెపి ఎంపీ సాక్షి మహరాజ్ 10మంది పిల్లల్ని కనాలంటే, చంద్రబాబేమో కనీసం నలుగుర్నైనా కనాలంటాడు. నయా ఉదారవాద విధానాలు మహిళల్ని అంగడి సరుకుగా మార్చాయి. బ్యూటీ పార్లర్లు, ఫ్యాషన్ షోలు, పబ్బులే ఆధునికత అని ప్రచారం చేస్తున్నారు. మహిళల్ని జుగుప్సగా చూపుతున్న టివి సీరియల్స్, సినిమాలు, ప్రకటనలు మామూలే. స్త్రీల వేషధారణే అత్యాచారాలకు కారణమని బాబాలు, మంత్రులే సెలవిస్తున్నారు. ఇక మహిళలకు రక్షణ ఎక్కడ? మోరల్ పోలీసింగ్, ఫత్వాల పేరిట మతోన్మాదులు ఆంక్షలతో మహిళల్ని కట్టిపడేస్తున్నారు. కులాంతర, మతాంతర వివాహాలను ఖాఫ్ పంచాయితీలు సహించలేక హత్యలు చేయిస్తున్నారు.

**అన్ని భారాలు మహిళలమీదే :** నిత్యజీవితావసర సరుకుల ధరలు అనూహ్యంగా పెరుగుతున్నాయి. ప్రజా పంపిణీ వ్యవస్థ నీరుగార్చబడింది. వ్యవసాయ సంక్షోభం కారణంగా పనులు లేక పెద్దఎత్తున వలసలు పోవాల్సి వస్తున్నది. వీటన్నిటికి ముందుగా గురయ్యేది మహిళలే. ముఖ్యంగా పేద,అసంఘటిత రంగంలో పనిచేసే కుటుంబాల్లోని మహిళలు తీవ్ర ఇబ్బందులెదుర్కొంటున్నారు. సమాన పనికి సమాన వేతనం లేక తీవ్ర వివక్షకు గురవుతున్నారు.

**విధానాలు మారకుండా మహిళల పరిస్థితులు మారవు :** ప్రభుత్వాలు సంక్షేమ పథకాలను నీరుగారుస్తున్నాయి. బడ్జెట్‌లో కోతపెడుతున్నారు. జనాభాలో 50%గా వున్న మహిళల సంక్షేమం కోసం జనాభా దామాషాలో నిధులు కేటాయించడంలేదు. కనీసంగా కేటాయించిన నిధులు కూడా ఆచరణలో ఖర్చు చేయడంలేదు. పేదల సంక్షేమం, సదుపాయాల విషయానికొస్తే డబ్బులు లేవని, సబ్సిడీలిస్తే సోమరులవుతారని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెబుతున్నాయి. కాని కుబేరులు, పరిశ్రమాధిపతులకు మాత్రం ఏటా లక్షలకోట్లు ముట్టజెబుతున్నారు. వీటికి రాయితీలని ముద్దుపేరు పెడుతున్నారు. ప్రజాసంక్షేమం కాకుండా బడాబాబులను ఉద్ధరించే ప్రభుత్వ విధానాలు మారకుండా మహిళల జీవితాలలో మార్పు రాదు. మహిళలు తమ సమస్యలు పరిష్కారం కావాలన్నా ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలి.

**ఉద్యమాలే శరణ్యం :** ధరల పెరుగుదల, నిరుద్యోగం, అవిద్య, అనారోగ్యం, ఆఘాయిత్యాలు, అత్యాచారాలు మరెన్నో సమస్యలకు కారణమైన పాలకుల విధానాలపై పోరు సల్పాలి. ఫ్యూడల్ ఆచారాలు, భావజాలంపై తిరగబడాలి. నయా ఉదారవాద, వినిమయవాద సంస్కృతిని ప్రతిఘటించాలి. మహిళల రక్షణకు ఉన్న కనీస చట్టాల్ని అమలు పరిచేందుకు కూడా భారీ ఉద్యమాలు నిర్మించాలి. సమాజంలో స్త్రీలను సమానంగా గౌరవించే ప్రత్యామ్నాయ విలువలకోసం, ఉన్న చట్టాల అమలుకోసం, కొత్త చట్టాల రూపకల్పనకోసం మహిళలు ఉద్యమించాలని సిపియం విజ్ఞప్తి చేస్తోంది. ఆగష్టు 14న జరిగే జిల్లా, మండల కార్యాలయాలముందు జరిగే ధర్నాల్లో పాల్గొనాలని సిపియం పిలుపునిస్తోంది.

అభివందనములతో... **తేది : 28.07.2015**

**భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)**
**ఆంధ్రప్రదేశ్ కమిటీ**